క్లుప్తంగా

అనాథ పిల్లలను అక్కున చేర్చుకుంటున్న 'భరోసా'

డాబాగార్డెన్స్: తల్లిదండ్రులు ఇద్దరినీ గానీ లేదా వారిలో ఎవరినైనా కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలను అక్కున చేర్చుకుని విద్యా బుద్ధులు నేర్పుతామని గాజుల తాళ్లవలసలో 'భరోసా' పేరిట నిర్వహిస్తున్న అనాథాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు, కన్స్యూమర్ రైట్స్ సభ్యుడు అట్టాడ అవినాష్, నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ బోర్డు సలహాదారి డాక్టర్ కె శ్రీతి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. భరోసా పేరిట అనాథశ్రమంలో చేరిన పిల్లలకు తామే తల్లీ, తండ్రిగా వారి బాగోగులను చూసుకుంటున్నామన్నారు. ఉత్తమ ఆశయాలతో నెలకొల్పిన ఈ భరోసా అనాథాశ్రమానికి ఇటీవల తమ సన్‌గ్రీన్ సూర్య ఉత్సవ్ సంస్థ తరఫున రిఫ్రిజిరేటర్లు బహూకరించామని చెప్పారు. ఆశ్రమంలోని పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. అనాథ పిల్లలను అందరి పిల్లల్లా తీర్చిదిద్దాలన్నదే తమ ఆశయమన్నారు.

ముస్లిం కుటుంబానికి సహాయం



రేషన్ అందజేస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: ఒక పేద ముస్లిం మహిళా కుటుంబానికి నెల మొత్తానికి సరిపడా రేషన్ సరకులను బుధవారం 39వ వార్డు కార్పొరేటర్ షాధిక్ అందజేశారు. ఆమె భర్త ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి బెడ్ రెస్ట్‌లో ఉండటం వల్ల పనికి వెళ్లడం లేదు. దీంతో ఇల్లు గడవని పరిస్థితిలో సాధిక్ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగా వారికి అవసరమైన రేషన్ అందించారు.

విద్యార్థులకు వితరణ



విద్యార్థులకు రెయిన్ కోట్లు అందజేస్తున్న మట్టపల్లి హనుమంతరావు

జగదాంబ: స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలోని ఉచిత ట్యూషన్ సెంటర్‌లో చదువుతున్న విద్యార్థులకు బుధవారం సంఘ సేవకుడు, చల్మాజీ ఇన్ఫ్రా అధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు 45 రెయిన్ కోట్లు అందజేశారు. తన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు అన్నదానం చేసి, బహుమతులు అందించారు. వివేకానంద అనాథాశ్రమానికి ప్రతి నెలా నాలుగు బస్తాల బియ్యాన్ని అందజేస్తున్నట్టు హనుమంతరావు ప్రకటించారు. కార్యక్రమంలో ట్యూషన్ అధ్యక్షులు అప్పారావు, సంస్థ సభ్యులు సిహెచ్.పైడిరాజు, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

మహిళావాద రచయిత చలం



మాట్లాడుతున్న కుప్పిలి భీమేశ్వరరావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రసంగ కార్యక్రమంలో 'చలం జీవితం, సాహిత్యం' అనే అంశంపై రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు కుప్పిలి భీమేశ్వరరావు ప్రసంగించారు. మహిళల జీవితాలను ఇతివృత్తంగా చేసుకుని వారికి స్వేచ్ఛ అవసరమని, సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక, మానసిక హింసలను చలం తన రచనల్లో ఎత్తిచూపారన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ చలం రచనలు 1920–50 మధ్య సమాజాన్ని ప్రభావితం చేశాయన్నారు. ఆయన రచనల్లో విశృంఖలత్వం వల్ల చాలా మంది పాఠకులు వాటిని నిరసించారని తెలిపారు. డాక్టర్ కె.జి.వేణు కార్యక్రమాన్ని సమీక్షించారు. సాహితీవేత్తలు, రచయితలు డి.వి.సూర్యారావు, కృష్ణబాబు, కె.వి.ఎస్.మూర్తి ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

వర్షాకాలం..అప్రమత్తత అవసరం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- జోన్–3లో క్షేత్రస్థాయి పర్యటన



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, అధికారులు

సీతమ్మధార: వర్షా కాలం దృష్ట్యా నగరంలోని ప్రధాన కాలువలతోపాటు చిన్న చిన్న కాలువలను ప్రతి రోజూ శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. జోన్–3 పరిధి 14వ వార్డులోని సీతమ్మధార, రామకృష్ణరాజునగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం పరిసర ప్రాంతాల్లో బుధవారం కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డులో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని, చెత్త కుప్పలు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. యూజీడీ కనెక్షన్లతోపాటు అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్ వద్ద కల్వర్టు మరమ్మతులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని, రామృకృష్ణనగర్‌లో కల్వర్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని, పోర్టు అధికారులతో మాట్లాడి నరసింహనగర్ రైతుబజార్ రోడ్డును 60 నుంచి 80 అడుగులకు విస్తరించేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

ఆకర్ష జోన్ ఏర్పాటు చేయండి

23వ వార్డు పరిధిలోని సీతమ్మధారలో కమిషనర్ సాయికాంత్ వర్మ పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం నుంచి రైతుబజార్ వరకు ఆకర్ష జోన్ ఏర్పాటు చేసి తోపుడు బళ్ల వ్యాపారులకు కేటాయించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశించారు. పర్యటనలో టౌన్ ప్లానింగ్ అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఈఈ సత్యనారాయణరాజు, ఏఎంహెచ్‌వో రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

స్మారక భవనం ఏర్పాటుకు వినతి



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద మాట్లాడుతున్న వాసుదేవరావు

డాబాగార్డెన్స్: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న స్మారక భవనాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు కోరారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా జడ్జి కోర్టు సమీపంలోని లచ్చన్న కాంస్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ విశాఖలో గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవేనన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి షీలానగర్ నుంచి అనకాపల్లికి వెళ్లే దారిలో 5 ఎకరాల స్థలంలో స్మారక భవనం, 100 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో తోట హరిశంకర్, దోంపక భాస్కర్, వెంకటరమణ, జలుమూరు చిట్టిబాబు, మార్కండేశ్వరరావు, అత్తిలి శంకర్రావు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

శిష్టకరణ సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా డొంకాడ

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా డొంకాడ అనిల్‌కుమార్ నియమితుడయ్యారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు ఎస్ఎన్‌కే మహంతి, ప్రధాన కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి సంయుక్తంగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.అనూషా పట్నాయక్, అఖిల భారత శిష్టకరణ సంఘం అధ్యక్షుడు కె.వేంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర శిష్టకరణ సంఘం గౌరవ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి రాజశేఖర్, గౌరవ సలహాదారుడు కె.నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జయతి ఉమామహేశ్వరరావు, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి మంత్రి నరసింహమూర్తి పలువురు సంఘ నాయకులు అభినందనలు తెలిపారన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమపథం



ఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

డాబాగార్డెన్స్: సంస్థకు నష్టం కలిగిస్తూ, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎంయూఐ జిల్లా కమిటీ బుధవారం చలో ఆర్ఎం కార్యాలయం కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఎస్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ స్టీల్ సిటీ డిపోలో జరుగుతున్న కక్ష్య సాధింపుపై తీవ్రంగా దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, సమయానికి జీతాలు ఇచ్చి ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం పంచుతుంటే.. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా విశాఖ జిల్లా యాజమాన్యం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ కోసం రాష్ట్ర కమిటీ ఓ వైపు కృషి చేస్తుంటే, ఉద్దేశ పూర్వకంగా స్టీల్‌సిటీ డిపోలో ఇబ్బంది పెడుతూ కనీస సమస్యలు పరిష్కరించకుండా, 34 రోజులుగా డిపోలో నిరాహార దీక్షలు జరుగుతున్నా యాజమాన్యం కనీస చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఉద్యమాన్ని జోనల్, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు. జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి మాట్లాడుతూ జిల్లాలో అనేక రూట్లలో బస్సులు తీసేస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 22 నుంచి ఆర్ఎం ఆఫీస్ వద్ద నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, రాష్ట్ర కార్యదర్శులు పీపీఎం రాజు, సిమ్మయ్య, రామారావు, జోనల్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, రీజనల్ అధ్యక్షుడు గండి రామకృష్ణ కార్యదర్శి నీలకంఠం, డివిజన్ కార్యదర్శి ఏకే శివాజీ, సంజీవి, పి.శంకరరావు, పీజీఆర్ వసంతరావు, జేఎస్ఎన్ రాజు, నాయుడు, చిన్నే, ఎంతఃరావు, అన్ని డిపోల కమిటీల గ్యారేజీ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వాసవీమాత సన్నిధిలో శ్రావణ మాసోత్సవాలు

డాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మాసంలోని ఐదు శుక్రవారాల్లో అమ్మవారి మూల విరాట్‌కు ప్రాతఃకాలంలో క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవార్ల స్తోత్ర పారాయణం, మహిళలచే సామూహిక శ్రీచక్ర సహిత కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. తొలి శుక్రవారం 18న అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరిస్తామన్నారు. ఆ రోజు సామూహిక లలితా సహస్రనామ పారాయణం, 108 గోత్ర రుషి పూజలు జరిపిస్తామని వివరించారు.

హిందూ ధర్మంలో రైతులదే అగ్రస్థానం



ప్రసంగిస్తున్న మనోహర్ దాస్

సీతంపేట: సనాతన హిందూ ధర్మంలో రైతులే అగ్రస్థానంలో ఉన్నారని, వారిని తగిన విధంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హిందూ ధర్మ ప్రచారకుడు మనోహర్ దాస్ అన్నారు. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో బుధవారం జరిగిన మిషన్ కర్షక దేవోభవ ప్రచారం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పూర్వం రాజులు అన్నదాతలకు అండగా నిలిచేవారని, నేడు పాలకులు వారిని అత్యంత నిర్లక్ష్యంగా చూస్తున్నారన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు ఆడారి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ రైతుల జీవనాన్ని పాఠ్యాంశంగా చేర్చితే రైతు శ్రమ, విలువ విద్యార్థి దశ నుంచే తెలుస్తాయన్నారు. యోగి ప్రభాకర్ జీ మాట్లాడుతూ తినే ముందు రైతులకు ధన్యవాదాలు తెలియజేయడం కనీస ధర్మమన్నారు. వారికి సమాజంలో అత్యున్నత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్తేర్ ఫొటోగ్రఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ప్రదర్శన జరగనుంది. ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రాంగణంలో నిర్వహించే ఈ ప్రదర్శన వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచ్యా పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి.ఎస్.సేతు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వి.వి.రామరాజు, సభ్యులు కె.ఎం.కె.రమేష్, సన్నీ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో దృష్టికి ఆశ కార్యకర్తల సమస్యలు

మహారాణిపేట: తమ గోడు చెప్పడానికి వెళ్లిన ఆశ కార్యకర్తలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు చులకన భావంతో వ్యాఖ్యలు చేశారని, తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ బుధవారం వారు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు పి.మణి మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరగా.. డీఎంహెచ్‌వో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఏఎన్ఎంల పనులు, ఇతర శాఖల సిబ్బంది పనులను కూడా ఆశా కార్యకర్తలు చేత చేయిస్తున్నారని డీఎంహెచ్‌వో దృష్టికి ఆమె తీసుకొచ్చారు. ఎన్ని చెప్పినా ఆయన వినకుండా తన ధోరణిలో ఏదో మాట్లాడటంతో ఆగ్రహించిన ఆశ కార్యకర్తలు కార్యాలయం ఎదుట బైఠాయించారు. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు బయటకు వచ్చి మాట్లాడటంతో వారు శాంతించారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో ఆశ కార్యకర్తలు నిరసన విరమించి వెళ్లిపోయారు.

విశేషంగా అమావాస్య తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: అమావాస్యను పురస్కరించుకుని బుధవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అలంకరించి పల్లకిలో అధిష్టంపజేసి సింహగిరి మాఢ వీధుల్లో తిరువీధి ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పారాయణదారులు, పండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కృష్ణా డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షలకు శిక్షణ



శిక్షణ కార్యక్రమాన్ని వివరిస్తున్న అధ్యాపకుడు సామ్యూల్ డేవిడ్ రాజ్

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ సెల్ కో–ఆర్డినేటర్ సామ్యూల్ డేవిడ్ రాజు తెలిపారు. కళాశాలలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు ఇండియన్ అకాడమీ ఆఫ్ కాంపిటేటివ్ ఎగ్జిమినేషన్స్‌తో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఏసీఈ రవిదాస్, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



కల్లూరి రాముకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు పరిధిలోని పలువురు రోగులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సహకారం అందించారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతులపై స్పందించిన ఆయన సొంత నిధుల నుంచి రూ.21 వేలు సాయం చేశారు. వార్డు పరిధిలో నివసిస్తున్న మజ్జి శ్రీనివాస్ కాలు, చేతులు చచ్చుబడి మంచాన పడడంతో, అతని వైద్యఖర్చుల కోసం రూ.5వేలు అందించారు. సూర్యాబాగ్‌లో నివసిస్తున్న సబ్బవరపు దేముడుబాబు ప్రమాదంలో గాయపడి పని చేయలేని పరిస్థితుల్లో ఉండడంతో ఆయన వ్యాపారం చేసుకునేందుకు వీలుగా రూ.లక్షా 30 వేల విలువైన మూడు చక్రాల స్కూటీని ఉచితంగా అందజేయడమే గాక, ఫిజియో థెరపీ కోసం రూ.5వేలు అందజేశారు. పార్టీ కార్యకర్త కుమారుడు తుపాకుల సాయి కార్తీక్ వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు, కిడ్నీ రోగి కల్లూరి రాముకు రూ.5వేలు, సరస్వతి పార్కు వద్ద కనకల అచ్చియ్యమ్మకు వెయ్యి రూపాయలు సాయం అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, జేసీఎస్ ఇన్‌చార్జి దొడ్డి రామానంద్, పార్టీ నాయకులు బాపూ ఆనంద్, రమణారెడ్డి, ఆదివిష్ణు, బొగ్గ శ్యామ్, లండా రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అలుపెరగని పోరాటం



దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటించే వరకు పోరాటం కొనసాగుతుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ పేర్కొన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహార దీక్ష బుధవారం నాటికి 865వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో అశేష త్యాగాల చేసి సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటామన్నారు. నగరంలోని అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులందరూ ఒక మాటపై వచ్చి పోరాడుతున్నామని చెప్పారు. ఇనుప ఖనిజ గనులు లేకపోయిన స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తోందన్నారు. ఈ ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతోపాటు కొత్తగా మన ముందు తరాలకు ఉపాధి ఉండదన్నారు. అందుకే దేశభక్తితో పోరాడుతున్నామని తెలిపారు. మోదీ సర్కారు బడా పారిశ్రామిక వేత్తలకు దేశ సంపదను అమ్ముకుంటూ పోతే.. భవిష్యత్తులో దేశ ప్రజలను తాకట్టు పెట్టే పరిస్థితులు వస్తాయన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.కె.రెహ్మాన్, జిల్లా నాయకులు కాసుబాబు, అడ్డూరు శంకర్, లంకా గోవింద్, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

విశ్వదేవుడు ఒక్కడే అన్నదే మా సినిమా సందేశం



బ్రహ్మం సు విష్ణు సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరుణాభాయ్ తదితరులు

డాబాగార్డెన్స్: 'బ్రహ్మం సు విష్ణు' సినిమా ప్రీమియర్ షోలు దేశ వ్యాప్తంగా ప్రదర్శిస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మల్టీమీడియా చైర్‌పర్సన్ కరుణాభాయ్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను 1971 నుంచి మీడియా రంగంలో ఉన్నానని, 87 ఏళ్లుగా తమ సంస్థ 147 దేశాల్లో సనాతన ధర్మం కోసం కృషి చేస్తోందన్నారు. బ్రహ్మకుమారీ సంస్థ.. ఆధ్యాత్మిక సంస్థని పేర్కొన్నారు. ప్రేమ, సంతోషం కోసం అన్వేషణ సాగుతోందని, విద్యా సంస్థల్లో వీటిని బోధించడం లేదన్నారు. చిత్ర డైరెక్టర్ ముప్పలనేని శివ మాట్లాడుతూ తాను తెలుగులో తాజ్‌మహల్, సంక్రాంతి వంటి 20 సినిమాలు తీశానని గుర్తు చేశారు. బ్రహ్మంసు విష్ణు సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా షూటింగ్ అంతా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిందని, పాన్‌ఇండియాలో భాగంగా ముందుగా హిందీలో విడుదల కానుందని, గంటన్నర నిడివిలో సినిమా ఉంటుందన్నారు. విశ్వదేవుడు ఒక్కడే అన్నది ఈ సినిమా సారాంశంగా పేర్కొన్నారు. త్వరలోనే సృష్టి అంతమవుతుందని చిత్రంలో చూపించామని వివరించారు. బ్రహ్మ పాత్రధారి అరుణ్‌బాయ్ మాట్లాడుతూ ఈ సినిమాలో బ్రహ్మ రహస్యాలు చక్కగా చిత్రీకరించామన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు రమా, బీకే శివలీల, సరళభాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కాలేజ్ పోటీల్లో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ

విజేతలకు ప్రిన్సిపాల్ అభినందన



విజేతలతో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: మంగళగిరిలోని ఎయిమ్స్‌లో 5వ కొలోక్వియంలో భాగంగా నిర్వహించిన ఆలిండియా అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అభినందించారు. ఈ పోటీల్లో ఏఎంసీ మొదటి సంవత్సరం విద్యార్థులు 12మంది పాల్గొనగా అనాటమీ మోడల్‌లో డి.సాయి వైష్ణవి బంగారు పతకం, అనాటమీలో డి.వి.రంగనాథ్ రజతం, జి.రోష్ని కాంస్య పతకాలు గెలుచుకున్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవీంద్ర కిషోర్, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మ గీతాంజలి, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వి.భవాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం



ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి దంపతులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలోని దేవదాయ శాఖ పరిధి దుర్గాగణపతి ఆలయ 31వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు దుర్గాగణపతిని దర్శించి పూజలు చేశారు. వారికి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆలయ అర్చకుడు నటరాజన్ పర్యవేక్షణలో గణపతి హోమం, మహాభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. సాయంత్రం 108 కలశాలతో దుర్గాగణపతి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో పల్లకీలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి, హారతులిచ్చి స్వామికి నీరాజనాలు పలికారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన సంగీతోత్సవాలు

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు బుధవారంతో ముగిశాయి.